ఉదయాన్నే కాఫీ తాగుతూ పేపర్ చదువుతున్న సుందరి, వెంకట్రావ్‌లను ఒక వ్యాపార ప్రకటన విశేషంగా ఆకర్షించింది.

'ప్రముఖ జపాన్ కంపెనీ టోక్రాచీ వారి ఇరవై తొమ్మిది అంగుళాల కలర్ టీవీ కేవలం మూడువేల రూపాయలు మాత్రమే' అన్నది దాని సారాంశం. ఆ ప్రకటనను పదేపదే చదివారు. ఇద్దరికీ నోరూరిపోయింది.

# ఘోరెం 'టీవీ'


-ఇలపావులూరి మురళీమోహనరావు



ఆ క్షణం నుంచీ ప్రస్తుతం తాము చూస్తున్న ఇరవై ఒక్క అంగుళాల బ్రాండెడ్ టీవీ చాలా చిన్నదిగా, అసహ్యంగా కనిపించసాగింది. ఎప్పుడో ఐదు సంవత్సరాల క్రితం దీపావళి సందర్భంగా పన్నెండువేలు పోసి కొన్నారు దాన్ని.


ఈ రోజు వరకూ ఏ రిపేరూ లేదు. అయితేనేం చిన్నదికదా. ఈమధ్య చాలామంది ఇళ్లల్లో ఎల్‌సీడీలు, ప్లాస్మాలు కనిపిస్తున్నాయి. హీనాతిహీనం అనుకుంటే ఇరవై తొమ్మిది అంగుళాల కలర్ టీవీలు కనిపిస్తున్నాయి. దాని కోసం ఎంత లేదన్నా పదిహేను వేలు పెట్టాలి. అంత డబ్బు పెట్టే తాహతు లేక ఉన్నదానితో సర్దుకుపోతున్నారు.

ఇప్పుడీ ప్రకటన చూడగానే వారిలో సరికొత్త ఆలోచనలు చిగురించాయి. ధర కూడా తక్కువ కావడంతో 'మంచి తరుణం మించిన దొరకదు', ఆలసించిన ఆశాభంగం' లాంటి సామెతల్ని గుర్తుకు తెచ్చుకున్నారు.



## క్రేజీ కాంబినేషన్

2002లో 'ఖాకీ' అనే సినిమాలో ఐశ్వర్యారాయ్-అక్షయ్ కుమార్ కలిసి నటించారు. మళ్లీ ఇన్నాళ్లకు 'యాక్షన్ రీప్లే' అనే సినిమాలో జంటగా నటిస్తూ ఆ సినిమాకి అట్రాక్షన్ అవుతున్నారు. మరి ఈ సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాల్సిందే మరి!




"ఏమంటారు?" అంది సుందరి.

సుందరి ఉద్దేశ్యం గమనించిన వెంకట్రావు "బాగానే వుందనుకో. మరి మన టీవీని ఏం చేయాలి?" అన్నాడు.

"మీకు కొనాలనే ఉద్దేశ్యం ఉంటే దాన్నేం చేయాలో నేను చూసుకుంటా" ఓరగా చూస్తూ అంది సుందరి అంతా మొగుడిదే పెత్తనం అని ఉబ్బేస్తున్నట్లు.

'అంటే తుది నిర్ణయం నాదే'నని నిర్ణయానికి వచ్చి పొంగిపోయాడు వెంకట్రావు.

"నాదేముంది? పాతదానినేం చేయాలో నువ్వే చెప్పు" అన్నాడు సుందరి బుగ్గమీద చిటికవేసి.

"మన పాత టీవీని నాలుగైదు వేలకు అమ్మేద్దాం. మూడువేలకు కొత్త దాన్ని కొని మిగిలిన రెండువేలతో వచ్చేటప్పుడు ఏదైనా చీర కొనుక్కుందాం కొత్త టీవీతోపాటు" ప్రతిపాదించింది సుందరి.

"నాలుగైదువేలకు అమ్ముదామా? ఇరవై తొమ్మిది అంగుళాలదే మూడువేలకు వస్తుంటే ఇరవై ఒక్క అంగుళాల పాత టీవీని ఎవరు కొంటారు?" నవ్వుతూ అన్నాడు వెంకట్రావు.

నాలుక కొరుక్కుంది సుందరి.

"అవును కదూ... ఇవాళ్టి పేపరు ఎవరూ చదవకపోతే ఎంత బావుణ్ణు" ఆశగా అంది.

"అందరూ అలాగే అనుకుంటారేమో" అన్నాడు వెంకట్రావు.

ఏదో ఆలోచన వచ్చి చిటికె వేసింది సుందరి.

"మనసుంటే మార్గం ఉండకపోదు. దాన్ని వదిలించే పూచీ నాది. మన పనిమనిషి కలర్ టీవీ కొనాలని అనుకుంటున్నది. దీన్ని దానికి అంటగట్టేద్దాం. ఐదు వేలు ఒకేసారి ఇవ్వలేనంటే నాలుగైదుసార్లుగా ఇమ్మందాం. అలా కూడా ఇవ్వలేనంటే నెల జీతంలో కొంత కట్ చేద్దాం. ఏమంటారు?" ఉత్సాహంగా అంది సుందరి.

"ఇంకేమంటాను? నీ బుర్ర పాదరసం అంటాను. స్త్రీ బుద్ధి ప్రళాయాంతకం అని ఊరికే అన్నారా? అటు చూడు మంగమ్మ వస్తున్నట్టున్నది. నాలుగువేలకు తగ్గొద్దు. ఇప్పుడు చేతిలో ఒక్క రూపాయి లేదన్నా సరే మందు టీవీని తీసుకెళ్లమను. డబ్బుల సంగతి తరువాత చూసుకుందాం" కన్నుగీటుతూ చెప్పి సీరియస్‌గా పేపర్ చదువుతున్నట్లు నటించసాగాడు వెంకట్రావు.

మంగమ్మ ధనధన అడుగులేసుకుంటూ వచ్చి చీపురుతో చిమ్ముతున్నది.

ఎప్పుడూ మంగమ్మమీద కస్సుబుస్సులాడే సుందరి ఇప్పుడు మాత్రం "మంగమ్మా" అని ప్రేమగా పలకరించింది.

"ఏంటమ్మా?" దగ్గరకొచ్చింది మంగమ్మ.

"మా టీవీని అమ్మేయాలనుకుంటున్నాము. నీకేమైనా కావాలంటే తీసుకో. డబ్బులు మెల్లగానే ఇవ్వవచ్చు. నువ్వెక్కడికి పోతావు? మేమెక్కడికి పోతాం?" మాటల్లోకి దించింది సుందరి.

చీపురును కింద పడేసింది మంగమ్మ.

"మీది పాత టీవీ కదమ్మా. మాకెందుకు? అదేదో పలకలాగుంటుందిట. గోడకు మేకు కొట్టి తగిలించుకోవచ్చునట. యాభైవేలకు బాగా సీపులో వస్తాదంట. దాన్ని తెస్తానన్నాడు మా అబ్బాయి. అయినా ఈ రోజుల్లో ఈ సిన్న టీవీలను ఎవరు సూత్తారమ్మా" అంట్లు తోమడానికి వెళ్లింది.

కళ్లు తిరిగిపోయాయి దంపతులిద్దరికీ.

"ఓసి దీని వయ్యారాన్ని చీపురు తిరగేసి కొట్టా. యాభై వేల రూపాయల టీవీ బాగా సీపుట. ఛీ...ఛీ... పుడితే మహళ్లల్లో పుట్టాలి లేకపోతే గుడి

సెల్లో పుట్టాలి. వెధవ బతుకులు... ఎన్నాళ్లున్నా గొర్రె తోకలు'' పళ్లు కొరికింది సుందరి.

వీళ్లు పేరుకు పనిమనుషులేగానీ కనిపించని లక్షాధికార్లు. ఇరవై ఏళ్ల నుంచీ జాబ్ చేస్తున్నా ఇరవై రూపాయల బ్యాంక్ బ్యాలెన్స్ లేదు. మన దగ్గ రేదో కట్టలు కట్టలు మూలుగుతున్నాయనుకుంటున్నారంతా. కానీ నిజానికి వీళ్లు మన కన్నా చాలా నయం'' అన్నాడు వెంకట్రావు.

"మా ఆఫీసులో స్వీపరు కూడా అంతే. దానికొచ్చే జీతం మూడువేలు. పొద్దున్న పదిళ్లల్లో పాచి పనులు చేస్తుంది. నెలకు ఐదువేలు చిట్టీలు కడుతుంది'' కసిగా అంది సుందరి.

ఈ విధంగా ఓ అరగంటపాటు పని మనుషులను ఆడిపోసుకున్నారిద్దరూ.

"సరే...సరే ఇక వాళ్ల విషయం వదిలేయ్. షాపువాడినే అడుగుదాం తీసుకుంటాడేమో. వాళ్లతో జాగ్రత్తగా బేరాలు చేయాలి. నువ్వూరికే చూస్తుండు. నేను మాట్లాడతా'' ముగించాడు వెంకట్రావు.

★★★

వెంకట్రావు, సుందరి షోరూమ్‌లోకి ప్రవేశించారు. ఇసుక వేస్తే జనం రాలడం లేదక్కడ.

పది పన్నెండు కౌంటర్ల దగ్గర ఎగబడి సేల్స్‌బోయ్స్ ప్రాణాలు తోడేస్తున్నారు చాలామంది ఆడామగా.

"రండి...రండి'' పిప్పళ్ల బస్తాలాగా ఉన్న వ్యక్తి నవ్వు తెచ్చుకుని ఆహ్వానించాడు.

టోక్రాచీ టీవీ గురించి అడిగింది సుందరి.

"యస్సార్... టోక్రాచీ కంపెనీ వారి లేటెస్ట్ మోడల్. గత వారం రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా అరవైలక్షల సెట్లు అమ్ముడుపోయాయి. హైదరాబాద్ మొత్తానికి మేమే హోల్‌సేల్ డీలర్లం. తక్కువ మార్జిన్స్‌కు అమ్ముతున్నాం. మీ బడ్జెట్‌కు బాగా సూటవుతుంది'' చెప్పాడు షాపు యజమాని.

"కానీ మూడువేలకొచ్చే టీవీ పని చేస్తుందా అని...?'' నసిగాడు వెంకట్రావు.

"సార్... దళారుల మాయాజాలం వల్ల మన కస్టమర్స్ ఎప్పుడూ మోస పోతుంటారు. ఇక్కడ మనం రెండువేల రూపాయలు పోసి కొన్న చీర సూరత్‌కు వెళ్తే వంద రూపాయలు కూడా ఉండదు. మదనపల్లెలో కిలో పదిపైసలకు కూడా అమ్ముడుపోని టమోటాలు హైదరాబాద్‌లో పదిరూపాయలకు అమ్ముతారు. ఇదంతా బ్రోకర్ల మహిమ. ఈ టోక్రాచీ టీవీ జపాన్‌లో రెండువేల ఐదువందల రూపాయలు. నలుగురు డీలర్ల చేతులు మారి మా దగ్గరకొస్తే పదిహేను వేలకు తక్కువరాదు. అందరికీ మార్జిన్లు కావాలికదా. అందువల్ల కస్టమర్స్‌కు చౌకగా అందించాలనే ఉద్దేశ్యంతో మేము నేరుగా టోక్రాచీ కంపెనీతో డీలింగ్స్ పెట్టుకుని జస్ట్ ఐదొందల లాభానికి అమ్ముతున్నాం'' చెప్పాడు యజమాని.

"అది సరే.. మరి వీటికి గ్యారంటీ వుంటుందా? ఒకవేళ చెడిపోతే...'' తెలివిగా అడిగింది సుందరి.

"అమ్మా... బ్రాండెడ్ కంపెనీలు ఆర్నెల్లు గ్యారంటీ ఇస్తాయి. ఈ కంపెనీ సంవత్సరం గ్యారంటీ ఇస్తున్నది. ఏ రిపేర్ వచ్చినా మా కంపెనీ ఇంజనీర్ మీ ఇంటికొచ్చి ఫ్రీగా రిపేర్ చేస్తాడు. మరి బిల్ రాయమంటారా?' అన్నాడు యజమాని.

వెంకట్రావు, సుందరి కళ్లతోనే మాట్లాడుకున్నారు. టీవీని అణువణువూ చూసారు. రెండునిముషాలు బొమ్మ చూసారు.

అన్నివిధాలా సంతృప్తి చెందిన తరువాత మూడువేలు చెల్లించి టీవీని ఇంటికి పంపమన్నాడు వెంకట్రావు.

"ఆటో ఛార్జీలు అవుతాయి. మా ఆటోవాడిని మాట్లాడుకోండి. సేఫ్టీగా ఇంటికి చేరుస్తాడు. గేటు ముందున్నాడు'' చెప్పాడు షాపు యజమాని బిల్లు ఇస్తూ.


వీరిని చూసి ఆటోవాలా గబగబా వచ్చాడు.

ఇల్లు ఎక్కడో అడిగి "అబ్బో...చాలా దూరం. ఐదొందలు ఇవ్వండి'' అన్నాడు.

షాకయ్యారు దంపతులు.

"ఐదొందలా? మా ఇల్లు ఆరుకిలోమీటర్లు కూడా లేదు. మహా అయితే అరవై రూపాయలు అవుతుంది'' అన్నది సుందరి కోపాన్ని ఆపుకుంటూ.

"ఆ ఆటోలు వేరు ఈ ఆటోలు వేరు మేడమ్. వచ్చేటప్పుడు ఖాళీగా



## గూఢచార విమానం ఫాల్కన్

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వారు శత్రువిమానాల, శతఘ్నుల కదలికలను పరిశీలించి విలువైన సమాచారాన్నిచ్చే గూఢచార విమానాలను (ఫాల్కన్) ఇజ్రాయిల్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మూడు విమానాల్లో మొదటిది ఇటీవల జామ్‌నగర్ విమానాశ్రయంలో దిగింది. దీన్ని చివరకి ఆగ్రాలో బేస్ చేస్తారుట.

## బొడ్డుతాడు ఉపయోగం

చాలా ఆసుపత్రులలో తల్లులకు పురుళ్లుపోసాక బిడ్డల బొడ్డుతాళ్ళని సేకరించి వాటి నమ్ముతారుట. ఎందుకంటే సర్జరీ చేసేటప్పుడు తెగిపోయిన నాడుల స్థానంలో వాటిని ఉపయోగిస్తారుట.

-విమలారామం



రావాలి'' అన్నాడు ఆటోవాలా.

అప్పుడు గుర్తుకొచ్చింది సుందరికి. తమ పాత టీవీ గురించి అడిగింది.

"ఆ ఓల్డ్ మోడల్స్‌కు అసలు వాల్యూ ఉండదు మేడమ్. దాన్ని తీసుకు రండి. మా ఇంజనీర్ టెస్టు చేసి ఫర్లేదంటే నాలుగువందలు ఇస్తాం'' అన్నాడు యజమాని.

"పన్నెండువేలు పోసి నాలుగేళ్లక్రితమే కొన్నాము'' అంది సుందరి.

యజమాని తన సెల్‌ఫోన్ చూపించి "ఐదేళ్లక్రితం ఇది ఇరవైవేలు. ఇప్పుడు రెండువేలు. ఎలక్ట్రానిక్స్ ఒక్కరోజు గడిచినా డిప్రిసియేషన్ ఎక్కువ'' పరమ శాంతంగా చెప్పాడు.


"వద్దులే. మరో రూంలో పెట్టుకుంటాములే'' అని నాలుగువందల యాభైకి ఆటో మాట్లాడుకుని టీవీని ఇంటికి తెచ్చారు.

***



## అర్థంలేని పుకార్లు

ఈ మధ్యనే ప్రియమణి టొయోటా ఇన్నోవా కారు కొన్నది. ఓ హీరో ఆమెకి కారు కానుకగా ఇచ్చాడని పుకార్లు వచ్చాయి. దీని గురించి ప్రియమణి స్పందిస్తూ- 'ఇలాంటి పనికిమాలిన పుకార్లు ఎవరు పుట్టిస్తారో అర్థం కాదు. నాకా కారుని ఎవరూ గిఫ్టుగా ఇవ్వలేదు. నేనే కొనుక్కున్నాను' అంటూ ఆ విషయాన్ని లైట్‌గా తీసుకుంది.




టీవీ స్క్రీన్ మీద పసుపు కుంకుమ అద్ది టెంకాయ కొట్టగానే డ్రైవర్ దానికి కనెక్షన్ ఇచ్చి ఏ విధంగా పని చేస్తుందో వివరించి వెళ్లిపోయాడు. స్క్రీన్‌మీద పెద్ద బొమ్మను చూడగానే తెగ మురిసిపోయారు దంపతులు.

"ఎంతైనా వాళ్ల టెక్నాలజీయే టెక్నాలజీ. చీప్ అండ్ బెస్ట్. మన ఇండియా ఎప్పటికి వాళ్ల స్థాయికి చేరుతుందో?'' అనుకున్నారు కాసేపు.

అరగంట తరువాత ఉన్నట్టుండి కరెంటుపోయి రెండు నిముషాల తరువాత వచ్చింది. టీవీలో బొమ్మ మాత్రం రాలేదు. ఏవో గీతలు వస్తున్నాయి.కంగారుగా లేచాడు వెంకట్రావు. ప్లగ్గును తీసి పెట్టాడు. స్విచ్‌లు ఆనాఫ్ చేసాడు.

అయినా బొమ్మ రావడంలేదు. పాత టీవీ పెట్టి చూసాడు. బాగానే వస్తోంది.

ఇద్దరికీ చెమటల్లు పట్టాయి. షాపుకు ఫోన్ చేసాడు వెంకట్రావు. యజమాని లిఫ్ట్ చేసాడు.

విషయం చెప్పాడు వెంకట్రావు.

"ఎన్నాళ్లయింది కొని?'' అడిగాడు యజమాని.

"ఇవ్వాళేనండీ జస్ట్ టూ అవర్సయింది.''

"ఎంతకు కొన్నారు? ఎవరు డెలివరీ చేసారు?''

"ఇందాకనేకదా మీతో గంటసేపు మాట్లాడింది. మీ ఆటోలో తీసుకెళ్లమని మీరేగా చెప్పారు''

"ఐసీ... మీరేమైనా రిపేరు చేసారా? మీరు ఒక్క స్క్రూ ఊడదీసినా గ్యారంటీ చెల్లదు''

"మేము అస్సలు ముట్టుకోలేదండీ''

"రేపు మా ఇంజనీర్ వచ్చి చూస్తాడు'' ఫోన్ పెట్టేసాడు షాపు యజమాని.

అతని స్వరం, వైఖరిలో వచ్చిన స్పష్టమైన మార్పును గమనించాడు వెంకట్రావు. ఇందాక చూపించిన వినయంలో వెయ్యోవంతు కూడా లేదు.

***

నాలుగురోజులు గడిచినా ఇంజనీర్ పత్తాలేడు. దాదాపు పాతికసార్లు ఫోన్ చేసినా 'అరగంటలో వస్తాడు, ఇప్పుడే బయటకెళ్లాడు'... ఇలాంటి జవాబులే.

వారంరోజుల తరువాత ఇంజనీర్ వచ్చి టీవీ మొత్తం ఊడదీసాడు. సాకెట్ ప్రాబ్లమ్ అని ఒకసారి, ఓల్టేజీ ప్రాబ్లమ్ అని ఒకసారి నెపమంతా వాళ్ల మీద నెట్టడానికి నానా ప్రయత్నం చేసి ఏదో రిపేర్ చేసి బొమ్మ తెప్పించి రెండువందలు బిల్లిచ్చాడు.

"అదేంటి సర్వీసింగ్ ఫ్రీ అన్నారుకదా?'' కోపంగా అన్నాడు వెంకట్రావు.

"సర్వీసింగ్ ఫ్రీయే సార్. నా కన్వేయన్స్ ఇవ్వాలికదా. ఇదే మీరు టీవీని మా వర్క్‌షాప్‌కు తెస్తే రానుపోను ఆటోకు వెయ్యి రూపాయలు అవుతుంది'' కూల్‌గా చెప్పాడు ఇంజనీర్.

ఏడుస్తూనే రెండువందలు సమర్పించుకున్నాడు వెంకట్రావు.

***

మరుసటిరోజు టీవీ ఆన్ చేయగానే టీవీలోంచి ఏవో పొగలొచ్చి బొమ్మ మాయమైంది. చెమటల్లు పట్టాయి దంపతులిద్దరికీ.

పదిన్నరకు షాపుకు ఫోన్ చేస్తే రేపు సాయంత్రం ఇంజనీర్ వస్తాడని చెప్పారు. ఆ రేపు అనేది వారంరోజులు, వంద ఫోన్ కాల్స్ తరువాత వచ్చింది.

ఇంజనీర్ మొత్తం చెక్ చేసి ఏదో సర్క్యూట్ కాలిపోయిందనీ, వర్క్ షాపులో ఇవ్వాలని చెప్పాడు.

వర్క్‌షాపుకు తీసుకువెళ్లాడు వెంకట్రావు. సంవత్సరం గ్యారంటీ ఉన్నది కాబట్టి భయపడనక్కర్లేదని, నెలరోజుల తరువాత రమ్మని చెప్పారు. ఆ పార్టు జపాన్ నుంచి రావాలట మరి.

★★★

ఆరునెలల తరువాత శుభవార్త వినిపించారు షాపువారు. ఐదువందల రూపాయలు ఆటోకు సమర్పించుకున్న తరువాత టీవీ ఇంటికి వచ్చింది.

"సంవత్సరం గ్యారంటీలో ఆర్నెల్లు వర్క్‌షాపులోనే ఉంది దరిద్రపు టీవీ. ఇకనుంచైనా జాగ్రత్తగా చూసుకోవాలి" అని స్విచ్ చేసాడు వెంకట్రావు. వెంటనే టపాకాయ పేలిన సౌండు వచ్చి కరెంటు ఫ్యూజులు కాలిపోయాయి.

కంగారుగా వెళ్లి ఎలక్ట్రీషియన్‌ని తీసుకువచ్చి ఫ్యూజులు వేయించాడు. అయినా లాభం లేకపోయింది. టీవీలో బొమ్మ మాత్రం రావడంలేదు. చుక్కలు వస్తున్నాయి.

కోపంగా షాపుకు ఫోన్ చేసాడు.

"డోంట్‌వర్రీ సార్. ఈ మాత్రానికే అనవసరంగా కోపం దేనికి? మరో ఆరునెలలు గ్యారంటీ పీరియడ్ ఉందికదా. మీరేం కంగారు పడకండి. ఫ్రీగా రిపేరు చేస్తాం. రేపు షాపుకు తీసుకురండి" జవాబిచ్చి ఫోన్ పెట్టేసాడు షాపువాడు.

మళ్లీ ఐదువందలు ఆటోకు సమర్పించుకుని టీవీని షాపుకు తీసుకువెళ్లాడు వెంకట్రావు.

వాళ్లు టీవిని ఓపెన్ చేసి "హై వోల్టేజీవల్ల టీవీ పిక్చర్ ట్యూబ్ కాలిపోయింది. కొత్తది వేయాలి. వారంరోజుల తరువాత రండి" అని చెప్పి రసీదిచ్చారు.

ఇక ఆ తరువాత అనేక వారాలు షాపు చుట్టూ ప్రదక్షిణాలు చేసాడు వెంకట్రావు.

ఇంజనీర్ లేడని ఒకసారి, టీవీ పార్టులు రాలేదని మరోసారి... ఇలా చెప్పిన కారణం చెప్పకుండా షాపువాళ్లు ఆరుమాసాలు కాలయాపన చేసారు.

చివరకు ఓరోజు షాపువాళ్లు ఫోన్ చేసి రిపేరు పూర్తయిందనీ, తక్షణమే వచ్చి తీసుకెళ్లమని చెప్పారు.

అప్పటికి రాత్రి ఎనిమిదయింది. ఆఫీసు పనిలో బాగా అలసిపోయి ఉన్న వెంకట్రావు 'బాగా లేటయింది. రేపు పొద్దునే వచ్చి తీసుకువెళ్తాను' అని చెప్పాడు.

"ఈరోజు అర్ధరాత్రి పన్నెండు గంటలతో వన్ ఇయర్ గ్యారంటీ పీరియడ్ పూర్తవుతుంది. రేపు తీసుకువెళ్లేట్టయితే ఐదువేలు బిల్లు కట్టాల్సి వస్తుంది" చావు కబురు చల్లగా చెప్పారు షాపువాళ్లు.

దానితో వెంకట్రావు పంచేంద్రియాలు బిగుసుకుపోయాయి. ఆఘమేఘాలమీద షాపుకు పరుగెత్తాడు.

ఐదు వందల రూపాయలు ఆటోకిచ్చి టీవీని ఇంటికి తెచ్చాడు. రాగానే ఆన్ చేసాడు.

బొమ్మ క్లియర్‌గా వస్తోంది. దంపతులిద్దరూ సంతోషించారు.

"హమ్మయ్య... ఆర్నెల్లు వర్క్‌షాపులోనే పెట్టుకున్నా చివరకు బాగానే రిపేరు చేసారు పాపం. ఎలాగైనా సరే ఇవ్వాళ తెల్లవార్లూ మేలుకుని టీవీలో ప్రోగ్రామ్స్ చూడాలి" అన్నది సుందరి.

"మరికేం రెండు కప్పుల టీ తీసుకురా. నేను కూడా చూస్తాను" కన్ను గీటుతూ అన్నాడు వెంకట్రావు.

అతను అలా అంటూండగానే హఠాత్తుగా గ్లాసులు పగిలిన శబ్దంతో టీవీ ఆగిపోయింది.

కెవ్వుమంది సుందరి.


"వెంటనే షాపుకు ఫోన్ చేయండి" అంది కంగారుగా.

పక్కనే ఉన్న పేపర్ వెయిట్ తీసుకుని స్క్రీన్‌మీదకు విసిరేసాడు వెంకట్రావు.

"ఇవ్వాల్టి నుంచి దీన్ని చెత్తబుట్టగా వాడుకుందాం. నో మోర్ ఆర్గ్యూమెంట్స్ ఆర్ కంప్లెయింట్స్" కోపంగా పాత టీవీని ఆన్ చేసాడు వెంకట్రావు.

దివ్యాతి దివ్యంగా వస్తోంది పాత టీవీ.

★



## ట్రఫుల్ బైక్

బెర్లిన్‌లో ఇటీవల డీడీసెంట్ అనే ఒక వెలో డిజైనర్ ఒక ట్రఫుల్ బైక్‌ని తయారు చేసాడు. దాని పొడవు 6.17 మీటర్లు, ఎత్తు 2.69 మీటర్లు. ఇలాంటి విచిత్రమైన డిజైన్లను 20 సార్లు సృష్టించిన అతను ప్రతిసారీ గిన్నెస్ బుక్‌లోకి ఎక్కుతూ వస్తున్నాడు.

## తుమ్మునాపేస్తే ముప్పు

తీవ్రంగా తుమ్మువస్తే ఆపుకోకూడదు. ఆ అదురుకు పక్కటెముక చిట్ల వచ్చు. బలవంతంగా ఆపుకుంటే తలలోనో, మెడలోనో రక్త నాళాలు చిట్లటమో, గుటుక్కున ప్రాణం పోవటమో జరుగుతుందిట!

-తటవర్తి

